# చిత్రగుప్తుని చిట్టా

చిత్రగుప్తుడు షార్ట్‌హాండ్ పద్ధతిలో జీవుల నేరాలు చిట్టా వ్రాస్తాడు. ఆ షార్ట్‌హాండ్ ఆయనే కనిబెట్టాడు. అయినా యెక్కడెక్కడి టైమూ చాలదు. అందుకనో యంత్రం కనిబెట్టాడు దానికి టెలిప్రింటర్ అని నామకరణం చేశాడు. ఆయన ఆఫీసులో లేనప్పుడు ఆ యంత్రం నేరాలు అందుతుండగానే చిట్టాలోకెక్కించేస్తుంది. తన ఫౌండర్ రాగానే యేమీ యెరగనట్టు చూస్తూ కూచుంటుంది.

యెప్పటి రిపోర్ట్ అప్పుడు, జీవులు భూమి వదిలారని తెలియగానే బాస్ యమధర్మరాజుకి అందించేస్తాడు. వినిపిస్తాడు. యమధర్మరాజు శిక్షలు వేస్తూ పోతాడు.

ప్రవేశము లేదు అనే బల్లకట్టినా కొన్ని మృతజీవులు నేర్పుగా ఆఫీస్‌లోకి దూరుతాయి. కొన్ని స్మగుల్ అవుతాయి. వ్రాసి వుంచిన చిట్టా తిరగేసి అక్షరక్రమంలో, తమ పేరుతో పాటు తమ ఆర్చ్‌రైవల్ పేరుగూడా చూస్తాయి. ఒక్కో గడుగ్గాయి చిత్రగుప్తుని నిగ్గదీస్తాయి. చిత్రగుప్త మెతకమనిషి.

“ఈ కాసినేనా వీడి నేరాలు? నీకు పక్షపాతమున్నట్టున్నది. తక్కువ శిక్ష పడేట్టు వ్రాయమని మృతులు మొత్తుకుంటారేమో”.

“అది పక్షపాతం కాదు జీవీ. మీ లోకంలో, మీ దేశంలో, మీ రాష్ట్రంలో గొప్ప భక్తుడు, వుద్యోగి, కవి అయిన రామదాసు, ఉరఫ్ కంచెర్ల గోపన్న, శాశ్వతత్వం పొందే కవనం అల్లాడు తెలుసుగా. భక్తుడిగా కన్నా కవిగానే రాణించాడు. “రామా! నేను నేరాలూ, క్రూరకార్యాలూ పాపాలు చేస్తూపోతుంటే

చిత్రగుప్తుడన్నీ వ్రాయలేక కొన్ని వదిలేశాడు. అయినా నువ్వు నన్ను మన్నించి కాపాడాల్సిందే. కాపాడక పోయావో, ''కరినేవింది హుళక్కి ద్రౌపదిగాచింది దబ్బర'' అలా యేకరువు పెట్టి అదంతా పుట్టి కవిత్వం అని తేలుతుంది సుమా'' అని ఛాలెంజ్ చేశాడు రాముడిని. అంతేనా జీవీ, ''క్రూరకర్మములు నేరక చేసితి. నేరము లెంచకు రామా'' అన్నాడు. సో బీరుపోకుండా చిఠ్ఠా వ్రాసినా లాభం లేదు. పెద్దవి వ్రాస్తే చాలు. మన్నించటానికి రాముడెలాగూ వున్నాడైపాయె'' కళ్లజోడు పైనించి చూశాడు జీవిని.

''దటీజ్ ఓకే. ముఖ్యమైన నేరాలన్నా చిఠ్ఠాలో కెక్కాయో లేదో చూడాలి సార్'' అన్నది జీవి.

''చూసొక్క అమ్మా! ఈ షార్ట్‌హాండ్ వచ్చా?'' పంపేయాలనే అడిగాడు.

''నేను ఛప్పన్న భాషలూ, రకరకాల వ్యాకరణాలూ, విభావట్ కే నమూనే చదవటం నేర్చినదాన్నండి. తొమ్మిది వ్యాకరణాలు నేర్వనిదీ వేదాలు అర్ధంగావన్నాడు మహర్షి వ్యాస్'' అన్నది గర్వంగా.

వింతపడినట్టు చూశాడు చిత్రగుప్త ''చివరిదేమిటో నేను వినలేదమ్మా. వివరించు. తెలుసుకుంటాను''.

''మహామహులు వ్రాసిన లేఖలు చదవటం నేరిస్తే హాండ్‌రైటింగ్ చదవటం సుగమమౌతుంది. భాషల్లో పదాలు తెలిసివుంటాయి. అదీ నమూనే. దస్తావేజులు చదివి, గొలుసుకట్టు చదివి, అర్ధం చెప్పాలంటే కోర్టు భాష, పాత పాలకుల భాషా వచ్చివుండాలి సార్''.

''నువ్వు పేర్కొన్న వెలావుంటాయీ విందాము. కూచో. నించున్నా

వెందుకూ? ఇక్కడికి పత్తిత్తులు రారు. నేరస్తులే అంతా'' నవ్వుతూ చూశాడు చిత్రగుప్త.

జీవి నవ్వి, ''సదరు కుమార్తె తన తండ్రి తాలూకు స్థిరాస్తి, చరాస్తులలో భాగం ఆడకూతుళ్లకూ చెందే చట్టం అమలులోకి వచ్చిందని తెలిసి, ఆ ఆర్డినెన్సు అమలులోకి వచ్చాకనే తాను పుట్టాననీ తనకూ తండ్రి ఆస్తిలో వాటా రావాలని అర్జీ ఖుద్దున ధఖలు పరిచింది. ఫాయదా వదలుకోదు. ముసాయిదా లబ్ధి వకీల్‌కీ కొంత ఇచ్చుకోవాల్సి వుంటుందని ఫిర్‌భీ హుజూర్‌కి విన్నవించుకున్న మతలబు యిది. తాఖీదూ ఖుద్దున తక్కిన వాటాదారులకి యిచ్చింది. ఖలిండ్ న్యాయం పరిశీలించి అదాలత్‌లో ముకద్దమా జరగకుండా జల్దీ సదరు కూతురు వాటా ఆమెకు చెందేట్టు చేయాలి. ఖుదా దయచూడవలెను. ఖర్చ్ జ్యాదా కాకుండా'' అంటున్నది జీవి.

'' ఆపమ్మా. అదేం భాషో విన్నట్టు లేదు'' చిత్రగుప్త బుర్రగోక్కున్నాడు.

''ముఘల్ పాలకులు పారశీకం రాజ భాష చేస్తే, తెల్లవారు ఇంగ్లీష్ రాజభాష చేశారు. అయినా తెలుగూ వారి సరసనే నడిచింది''.

'సరే. ఇదుగో చిఠ్ఠా. అక్షరక్రమంలో నేరగాడి పేరు కంటబడును''.

''తెలుసు'' అంటూనే పేరు కనబడగానే నేరముల చిఠ్ఠా చదవసాగింది.

'' ఇది చాలా అన్యాయం సార్. ముఖ్యమైన పెద్ద నేరాలు వదిలేసి, వ్రాశానంటే వ్రాశానని యేదో గొలుసుకట్టులాగా లాగేశారే'' కర్కశంగా అన్నది జీవి.

‘‘ ఉండు. నువ్వూ క్రిమినల్‌వేగా! కోపమెందుకు? నేను యాబ్‌సెంట్ అయితే టెలి కొన్ని ప్రింట్ చేస్తుంది. అన్నీ వినలేదేమో. మునిగిందేమిటీ? నువ్వు చెప్పు యిపుడెక్కిస్తా చిత్తాలోకి. రెండువేపులా మార్జిన్ అంగుళం. పైనా కిందా అంగుళున్నర వదిలి నోట్‌డౌన్ మొదలౌతుంది. ఫుట్‌నోట్స్, కరెక్షన్ కోసమలా వదిలేస్తాను’’ ఓదార్పు సానుభూతీ వినిపించాయి మాటల్లో.

‘‘అసత్యమాడే వానిని మోయలేనన్నది భూదేవి. ఈ క్రిమినల్ పక్కా అసత్యమాడి నేనలా అనలేదు. దాని అర్థం అంత పెద్దదని తెలియదు అని బ్లఫ్ చేస్తాడు. సత్యవాన్ని అని నమ్మిస్తాడు. హరిశ్చంద్రుడినంటాడు’’.

‘‘ప్రూవ్ చేయాలి. నిందలెక్కించము చిత్తాలోకి’’.

‘‘నిందా?’’ అంటూనే జీవి పోలరాయిడ్ ఫొటోలు, వీడియో ఫిల్ములూ, మెస్మరైజ్ చేస్తున్నట్టు చూపించింది. సౌండ్‌ట్రాక్ లాగా అరిచింది. ‘‘బోడిగుండు అత్తగారి బాధా, పోరూ, నస, దెప్పటం, దాష్టీకం వుండవు నీకు. నీ దోవన నువు జీవిస్తావు అని నమ్మబలికి క్రియరూపంలో సరిగ్గా దానికి వ్యతిరేకంగా ప్రాక్టికల్స్ చేశాడు సత్యద్రోహి’’ అలా సౌండ్ రికార్డింగ్ మెషీన్ వినిపిస్తుంటే, దిమ్మెర పోయాడు చిత్రగుప్త. గుండె రాచుకుంటూ అన్నాడు.

‘‘పెద్ద క్రైమ్స్ దాటేసింది టెలి. అయిపోయినట్టేనా?’’

‘‘లేదు. పెళ్లెందుకాడవు అనడిగాడు. వంట నెత్తినెక్కుతుందని ఆడలేదు. యేదో ఒకటి తిని, వుద్యోగం చేయాలని అభిలాష అంటే ‘‘నువ్వాపని చేయక్కర్లేదు’’ అని వీపు తట్టి ధైర్యోత్సాహాలిస్తూ, సంసారమనే ఊబిలోకి లాగి వంటలక్కలాగా మార్చాడు. పరాయి యిళ్ళలో గూడా రుచిగా వేళకి వండి

వడ్డించే అవసరం చాతుర్యంగా చూపాడు. అంతేనా శత్రువులకి ద్రోహులకీ, నయవంచకులకీ గూడా డయట్ ప్రకారం వండి తినిపించి ఆరోగ్యవంతులను చేయమని చేయించాడు. యేదైనా కోరిక తీర్చమని అడిగితే, ఆ కోరిక తీర్చగల సమర్థుల యిళ్ళలో వంట చేసిపెట్టి మెప్పించి నా పనులు నెరవేర్చుకోమన్నాడు. ఛలోక్తులు, చెణుకులు, చతురోక్తులతో, మెట్ట వేదాంతంతో పచ్చి మోసం చేశాడు'' అని ఆయాసపడుతున్న జీవిని చూసి చిత్రగుప్త ''డోంట్ వరీ వై డియర్, అవన్నీ యెక్కిస్తా చిత్తాలోకి. చిత్తా చదివే బాస్ శిక్షలు వేస్తాడు'' అన్నాడూరడింపుగా.

''మీ సింపతీ అనవసరం. యేం శిక్షపడుతుందో చూడాలి. అందుకు వాని క్రైమ్స్ వినాల్సిందే. నాలుగ్గోడల మధ్యా రానివి మీ మటుకు తిరుగుండదని మిఠాయి కిల్లీ నమిలేస్తూ, లైఫ్‌లో సెటిల్ అయింది మొదలుకొని అన్ని అధికారాలు తన చేజిక్కించుకుని, ధనం మీద, రాబడి మీద, ఆచార వ్యవహారాల మీద, నౌకర్ల మీద, పిల్లల మీద, వారి చదువులు కట్టు బొట్టూ విషయాలలో గూడా జోక్యం చేసుకోనివ్వలేదు. చివరికి కూరలమ్మి, పనిమనిషి , పక్షం మాటాడి నా నోరు నొక్కేశాడు. అహింసావాది, జీవకారుణ్య సంఘ సభ్యుడుగా బురఖా వేసుకుని'' అని గొంతు చించుకుంటున్న జీవిని చూసి,

''యింకే క్రైమ్స్ కక్కుతుందో సాటి మగవాడి మీద'' అని కుర్చీ వదిలేసి లేచాడు చిత్రగుప్త. పక్కనే జీవి,

''గొప్పవాళ్లు, హోదా సమర్థతా వున్న నా ఫ్రెండ్సుని చూచిరావాలి నువ్వు మనల్ని అవసరానికి ఆదుకుంటారు వాళ్లు'' అని బలవంతంగా తోలితే వెళ్లాను. వాళ్లు నన్ను వెర్రికుట్టెను చూసినట్టు చూచారు. గబ్బిలాన్నీ పల్లెటి గొడ్డును చూచినట్టు చూచారు''.

''గప్‌చిప్‌గా వుండిపోయాను. క్రిమినల్ నన్ను వదల్లేదు''.

''వాళ్లకు నువ్వెవరో తెలియదుట. పొరపాటు చేశాము. మళ్లా పంపండి. ఈ మాటు గౌరవిస్తాం'' అన్నారు. నువ్వు మళ్లా వెళ్లి ''నేను ఫలానా గొప్ప వ్యక్తి స్త్రీని'' అని చెప్పుకోవాలి అన్నాడు. అది వరస్ట్ క్రైం. '' ఇంకా నయం అట్టమీద వ్రాసి తాడు గట్టి అట్ట మెళ్లో వేసుకోవదూ! వీనికి మూర్ఛలున్నాయి. పడిపోతాడు దయచేసి ఫస్ట్‌యెయిడ్ చేయండి'' అనే అట్టతో మనుషులు తిరుగుతూ వుంటారు అలాగా!''.

చిత్రగుప్త చెవులల్లో వేళ్లుంచుకుని గబగబా అంగలు వేస్తుంటే పక్కనే జీవి ''ద్రోహి, క్రిమినల్'' అంటూ వెంబడిస్తుంటే క్యూలో నిలబడిన జీవులన్నీ ఇహిహీ, ఇహిహీ అని నవ్వుతూ వారిద్దరినీ చూశాయి. స్వేచ్ఛ లభించింది గనక, తమ ఆపోజిట్ జీవుల నేరాల చిట్టాలు చదవాలని కుర్చీవేపు గుంపుగా వెళ్లాయి. టెలిప్రింటర్ చిత్రగుప్త యాబ్సెంటుని చూసి పేజీలకు పేజీలు నేరాల చిట్టాలు విడుదల చేస్తూ బిజీ అయింది.